సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం। 16। సెప్టెంబర్। 2024



నిత్యాన్నదాన పథకానికి విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఆదివారం బండా సుబ్బరాజు, సరస్వతి దంపతులు, ఎం.శ్రీకాంత్ దంపతులు రూ.లక్ష చొప్పున విరాళంగా సమర్పించారు.



మిగిలింది ఆరు రోజులే..

ఆరు నెలల కిందట ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు మరో ఆరు రోజుల్లో ముగియనున్నాయని పొగాకు బోర్డు అధికారులు వెల్లడించారు. - వివరాలు 8లో

6.90 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం రాత్రి 6,90,849 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద ఆదివారం రాత్రి 7 గంటలకు 9.50 అడుగుల నీటి మట్టం ఉంది. డెల్టా కాలువలకు 12,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

మహా ప్రసాదం స్వామీ..



వేలంలో దక్కించుకున్న లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి గ్రామంలో శ్రీసిద్ధి వినాయక స్వామివారి ఆలయం వద్ద స్వామివారి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇక్కడ స్వామి వద్ద ఉంచి లడ్డూ ప్రసాదానికి ఆదివారం వేలం వేయగా రూ.65,200కు గ్రామానికి చెందిన పోలిశెట్టి దొరబాబు, పోలిశెట్టి రామదాసు దక్కించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద మద్దింశెట్టి సుబ్బరాజు కుమారులచే అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

అయినవిల్లిలో ముగిసిన నవరాత్ర ఉత్సవాలు



పూర్ణాహుతి సమర్పిస్తున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రాజు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి సన్నిధిలో చవితి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ నెలకొంది. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో స్వామివారికి లక్షగరిక పూజ, పంచామృతాభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం పంచ హారతులు ఇచ్చారు. అనంతరం గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. మేళతాళాలు మధ్య స్వామిని ఊరేగించారు. బాణసంచా కాల్చారు. కేరళ డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం జరిపారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పూర్ణాహుతి సమర్పించారు. దీంతో చవితి ఉత్సవాలకు ముగింపు పలికారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న మట్టి గణపతి విగ్రహాన్ని సమీప పంట కాలువలో నిమజ్జనం చేశారు. సోమవారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నారు.

రేపు పీజీఆర్ఎస్

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం తెలిపారు. అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

మంట నూనె



ఏం తినాలి.. ఏం కొనాలి.. అన్నట్టుంది ప్రస్తుత పరిస్థితి. వంట గదిలోకి వెళ్తే చాలు పప్పు నుంచి ఉప్పు వరకూ, కూరగాయల నుంచి ఉల్లిపాయల వరకూ.. వీటితో ఏం వండాలన్నా గుండె అ'ధర'తోంది.. నిత్యావసరాల ధరలు అంతకంతకూ పెంచుకుంటూ పోతే ఎలా తినేదని సర్వత్రా నిరసన వెల్లువెత్తుతోంది.. ఈ జాబితాలోకి వంట నూనె కూడా చేరింది. ఇది జనానికి మరింత భారంగా మారింది. కేంద్రం తెచ్చిన వంట.. మంట గురించి తెలుసుకుందాం రండి.

- నలసల కాగుతున్న ధర
- సుంకాలను పెంచేసిన కేంద్రం
- లీటరుకు రూ.20 నుంచి రూ.30 వరకూ భారం
- ఉమ్మడి జిల్లాలో 14.5 లక్షల కుటుంబాలపై ప్రభావం

అలమూరు: పెరిగిన నిత్యావసరాల ధరలు జనానికి కంగారు పుట్టిస్తున్నాయి.. ఏం తినాలో తెలియక ఆందోళన రేకెత్తిస్తున్నాయి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలో వచ్చి మూడు నెలలు దాటుతున్నా ధరల నియంత్రణకు వెనుకడుగు వేస్తున్నాయి. ఇది చాలదన్నట్టు రోజూ ఇంట్లో వంటకాల్లో ఉపయోగించే నూనెలపై కేంద్రం సుమారు 20 శాతం మేర సుంకం పెంచింది. ఇదే మార్కెట్‌లో ధరల పెరుగుదలకు కారణమైంది. వంట నూనెల సుంకం పెంచుతారని ముందే భావించిన వంట నూనె తయారీ కంపెనీలు మూడు రోజుల నుంచి సరఫరా నిలిపివేసినట్లు వర్తకులు చెబుతున్నారు. రెండేళ్ల కిందట రష్యా- ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో పెంచిన ధరల తరహాలోనే కృత్రిమ కొరత సృష్టించి వంట నూనె ధరలను భారీగా పెంచుకుంటూ పోతారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇలా పెంచేసి..

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై సుంకాన్ని భారీగా పెంచింది. పామాయిల్, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి ముడి సరకుగా దిగుమతి చేసుకునే వంట నూనెలకు గతంలో ఎటువంటి (బేసిక్ కస్టమ్స్ డ్యూటీ) సుంకాలు లేవు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వాటిపై 20 శాతం మేర దిగుమతి సుంకాన్ని విధించింది. అలాగే శుద్ధి (రిఫైన్డ్) చేసిన వంట నూనెలపై గతంలో 12.5 శాతం ఉన్న సుంకాన్ని 32.5 శాతానికి పెంచేసింది. దీంతో ప్రతి లీటర్ ప్యాకెట్‌కు రూ.20 నుంచి రూ.30 వరకూ అదనపు భారం పడుతుంది. వంట నూనెల పెరుగుదలతో ఉమ్మడి జిల్లాల్లో ప్రతి నెలా రూ 17.49 కోట్ల భారం పడనుంది. మూడు జిల్లాల్లో సుమారు 14.5 లక్షల కుటుంబాలకు ఉండగా, ఒక్కో కుటుంబం నెలకు సరాసరి సగటున ఐదు కిలోల వంట నూనె వినియోగిస్తుంది. ప్రతి నెలా ఒక్కొక్కరిపై రూ.100 నుంచి రూ.130 వరకూ అదనపు భారం పడనుంది. కేంద్ర ప్రభుత్వం విధించిన సుంకాలను అవకాశంగా తీసుకుని హోల్‌సేల్ వ్యాపారుల నుంచి చిల్లర వ్యాపారుల వరకూ మరింత అదనపు ధరలకు విక్రయించే అవకాశం లేకపోలేదని అభిప్రాయం వ్యక్తమవుతుంది. కేంద్ర ప్రభుత్వం సుంకాల పెంపు ప్రకటన వెలువడగానే హోల్‌సేల్ వ్యాపారులు వంట నూనెల కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. ఇప్పటికే నూనెల నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోల్‌సేల్ కిరాణా దుకాణాల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అలాగే రిటైలర్లు కూడా తమ వద్ద ఉన్న వంట నూనెలను సుమారు 25 శాతం మేర పెంచేసి విక్రయిస్తున్నారు. వినియోగదారుల స్థితిని బట్టి చిన్న దుకాణాల్లో మరింత ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. రాష్ట్రంలో ధరలను అదుపు చేసే యంత్రాంగం లేక వ్యాపారుల ఇష్టారాజ్యం అవుతోంది.

ఈ-కామర్స్ సంస్థల్లోనూ..

వంట నూనెలపై సుంకాల పెంపుతో ఈ-కామర్స్ (ఆన్‌లైన్) సంస్థలు వంట నూనెల విక్రయాలను పూర్తిగా నిలిపివేశాయి. నిత్యావసరాలపై ఇప్పటి వరకూ పోటీపడి మరీ రాయితీలు ఇచ్చిన ఆ సంస్థలు సుంకాల పెంపుతో నూనెల విక్రయాలను ఆపేశాయి. శనివారం సాయంత్రం వరకూ నిర్ణీత ధరలతో కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించిన ఈ-కామర్స్ సంస్థలు, అదే రోజు రాత్రి నుంచి అవుట్ ఆఫ్ స్టాక్ అంటూ డిస్‌ప్లే చేయడం గడ్డు పరి

నూనెల రకాలు	పాత ధర (రూ.)	కొత్త ధర (రూ.)	వ్యత్యాసం (రూ.)
పామాయిల్	95	113	18
సన్‌ఫ్లవర్	115	135	20
సోయాబీన్	108	130	22
వేరుశెనగ	157	178	21
రైస్ బ్రాండ్	118	128	10

స్థితికి అద్దం పడుతోంది. ఎమ్మార్పీలు అధికంగా ఉన్న ప్రముఖ కంపెనీలకు చెందిన వంట నూనెలు మాత్రమే ఈ-కామర్స్ సంస్థలు విక్రయిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోకపోతే నూనె ధరలు రెట్టింపయ్యే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఉపశమనం కలిగిస్తారా!

పెరిగిన వంట నూనె ధరల నుంచి పేదలకు ఉపశమనం కలిగించేందుకు రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై వంట నూనెలను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని ప్రజలు కోరుతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కందిపప్పు, వంట నూనెలను సరఫరా చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా అదెక్కడా అమలు కావడం లేదు. ప్రస్తుత పరిస్థితిలో ఆ హామీని నిలబెట్టుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మార్కెట్‌లో వ్యాపారులు సృష్టించే కృత్రిమ కొరతను అరికట్టి వంట నూనెల ధరలకు అడ్డుకట్ట వేయాలని అంటున్నారు. అలాగే ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ధరలు పెరిగినా సామాన్య ప్రజలకు భారం లేకుండా చూడవచ్చని సామాజిక వేత్తలు చెబుతున్నారు.

ఇంత పెంచడం సరికాదు



నూనె లేనిదే వంట చేయలేం. అను నిత్యం ఉపయోగించే వంట నూనెల ధరలు ఒకేసారి ఇంత దారుణంగా పెంచడం సరికాదు. వీటి ధరల నియంత్రణకు ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలి. రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై వంట నూనెలను సరఫరా చేసేలా చూడాలి. అప్పుడే పేదలకు ఇబ్బంది లేకుండా ఉంటోంది. ఆ దిశగా కార్యాచరణ చేయాలి.

– కె.పార్వతి, గృహిణి, పినపళ్ల, ఆలమూరు మండలం

సరఫరా ఆగిపోయింది



హోల్‌సేల్ మార్కెట్ నుంచి వంట నూనెల సరఫరా నిలిచిపోయింది. తమ వద్ద నిల్వలను ఇప్పటికే పాత ధరలకే విక్రయించాం. హోల్‌సేల్ వ్యాపారులు నిర్ణయించే ధరలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విక్రయాలు చేస్తాం. రానున్న రోజుల్లో ఈ ధరలు పెరిగే అవకాశం లేకపోలేదు.

– పిల్లి నాగరాజు, రిటైల్ వ్యాపారి, పెదపళ్ల, ఆలమూరు మండలం

రాయితీపై అందించాలి



ప్రకృతి విపత్తులతో రోజు రోజుకూ పెరిగిపోతున్న నిత్యావసరాలను రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు రాయితీపై అందించాలి. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. వంట నూనెల ధర పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుంది.

– ఎం.మాచరావు, తాతపూడి, కపిలేశ్వరపురం మండలం

అడవిలోనే పులి జాడలు

జిల్లా అటవీ శాఖ అధికారి భరణి



ఆదివారం తెల్లవారుజామున ట్రాప్ కెమెరాలో చిక్కిన చిరుతపులి

రాజానగరం: దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు పరిధిలోనే చిరుత పులి సంచరిస్తోందని, తాము అమర్చిన ట్రాప్ కెమెరాలో దాని కదలికలు ఆదివారం తెల్లవారు జామున రికార్డు అయ్యాయని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు.

పిల్లలను బయటకు పంపొద్దు

ప్రస్తుతం వరుసగా సెలవులు రావడం వల్ల బడి పిల్లలను సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత ఒంటిరిగా బయటకు పంపించవద్దని, రిజర్వు ఫారెస్టు పరిసరాలైన ఆటోనగర్, లాలాచెరువు హెచ్‌బీ కాలనీ, స్వరూపానగర్, దివాన్‌చెరువు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిని అటవీ శాఖ అధికారి హెచ్చరించారు. అసత్యప్రచారాలను నమ్మవద్దని, ఇంతవరకు పులి అటవీ ప్రాంతాన్ని వదిలి బయటకు రాలేదని ఆమె స్పష్టం చేశారు.

ఏలేరులో తగ్గిన నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: ఎగువప్రాంతం నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఏలేరు ప్రాజెక్టులో ఆదివారం నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. మూడు రోజులుగా కాస్తున్న ఎండలకు ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుముఖం పట్టాయి. పరీవాహక ప్రాంతం నుంచి 5,643 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులో చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 85.71 మీటర్లు, 24.11 టీఎంసీలకు 22.38 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో దిగువ ప్రాంతానికి 5875 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విశాఖకు 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

లోవకు రూ.2.88 లక్షల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ తల్లి లోవ దేవస్థానానికి వివిధ విభాగాల ద్వారా రూ.2,88,629 ఆదాయం సమకూరిందని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చిన రెండు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈయన తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.91, 990, పూజా టికెట్లకు రూ.46,470, కేశఖండనశాలకు రూ.9600, వాహన పూజలకు 367, కాటేజీలు, వసతి గదుల అద్దెలు రూ.48,792, విరాళా లు రూ.91,410 వెరసి మొత్తం రూ.2,88,629 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు.

బకాయి సొమ్మును విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సూర్యనారాయణ

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన వివిధ రకాల బకాయిలు రూ.25 వేల కోట్లు చెల్లింపునకు సీఎం చంద్రబాబు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ఆదివారం జరిగిన జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం శాసనసభలో విడుదల చేసిన శ్వేత పత్రంలో రూ.21,225 కోట్ల బకాయిలు ఉన్నట్లు చూపించిందన్నారు. వీటి విడుదలకు ప్రభుత్వం హామీ ఇవ్వాలన్నారు. 12వ వేతన సవరణ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపారావు, వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రత్నంరాజు, కోనసీమ ఉద్యోగుల సంఘ నాయకులు మద్దాల బాపూజీ, కె.మల్లిబాబు, కొప్పిశెట్టి వెంకట గణేష్, వీరబాబు, కట్టా ప్రసాద్, రాయి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో పవిత్రోత్సవాలు పరిపూర్ణం



అంతర్వేది ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారంతో వార్షిక పవిత్రోత్సవాలు పూర్ణాహుతితో పరిపూర్ణమయ్యాయి. ఈ నెల 12వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో అర్చకులు నాలుగో రోజు పవిత్రోత్సవాలను ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయంలోని పురాతన కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఆశీనులు చేశారు. వేదమంత్రోచ్చారణ మధ్య స్వామివారికి అభిషేకం చేశారు. తిరుమంజనం, మహా శాంతి హోమం నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకుడు కిరణ్, స్థానాచార్య వి.రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకులు పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత కంచుగరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, దాత గొట్టుముక్కల భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు వేదాలే మూలం

- శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభలో ఘనాపాఠీలు
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది రాక



వేదస్వస్తి చెబుతున్న పండితులు

అమలాపురం టౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేద ఘనాపాఠీలు, పండితుల వేదాధ్యయనం, వేదస్వస్తితో అమలాపురం పట్టణం పులకించింది. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో వామన జయంతి సందర్భంగా స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన 62వ వార్షికోత్సవ వేద విద్వత్సత్కార సభలో వేద ఘనాపాఠీలు ఉపన్యాసాలు కోనసీమ వేదాభిమానులను ఆధ్మాతికంగా ఉత్తేజపరిచాయి. మానవ మనుగడకు వేదాలే మూలమని ఘనాపాఠీలు తమ ఉపన్యాసాల్లో ఉద్బోధించారు. బ్రహ్మశ్రీ కడియాల వెంకట సత్యసీతారామ ఘనాపాఠి అధ్యక్షతన జరిగిన ఈ వేద సభ వేదికపై తిరుపతి వేద విశ్వ విద్యాలయం వేదార్థ పండితుడు ప్రవా రామకృష్ణ సోమయాజి, తిరుపతి వేద విశ్వ విద్యాలయం డీన్ డాక్టర్ దువ్వూరి ఫణియజ్ఞేశ్వర ఘనాపాఠి, రాజమహేంద్రవరానికి చెందిన శృంగేరి ఆస్థాన విద్వాంసులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, ఇరగవరానికి చెందిన తిరుపతి వేద సూపర్‌వైజర్ గుళ్లపల్లి చిన ఆంజనేయ ఘనపాఠి, గుంటూరుకు చెందిన గుండు శివ కుమారశర్మ ఘనపాఠి, నందంపూడికి చెందిన వడ్లమాని సుబ్రహ్మణ్య ఘనపాఠి ఆశీనులై వేదాధ్యయనం చేశారు. మొత్తం ప్రపంచాన్ని మానవ ధర్మంతో పాలించేది ఆ నాలుగు వేదాలేనని స్పష్టం చేశారు. మానవ జాతిని శాసించేది, నడిపించేది వేదాలేనని పేర్కొన్నారు. వేదాల్లో యజ్ఞ యాగాదులు, కర్మ కాండలకు సంబంధించిన ఉపనిషత్తులను వివరించారు. తొలుత ఉదయం స్థానిక చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ అధ్యక్షుడు గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా ఆధ్వర్యంలో వేద ఘనాపాఠీలు వామన జయంతి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం వేదసభకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది వేద ఘనాపాఠీలు, వేద పండితులు తరలివచ్చారు. తర్వాత వేద ఆశీర్వచనం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వేద ఘనాపాఠీలు, వేద పండితులను శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ ప్రతినిధులు సత్కరించారు. వేదశాస్త్ర సంస్థ ప్రతినిధులు యేడిద సుబ్రహ్మణ్యం, కుమారశాస్త్రి, భాస్కర్, మండలీక ఆదినారాయణ తదితరులు వేద పండితులకు సేవలు చేశారు.

మానవ జీవితంతో ముడిపడి



మానవ జీవితంలో వేదాలు ముడిపడి మనిషిని ధర్మం, జ్ఞానం వైపు నడిపిస్తాయి. వేద శబ్ద తరంగాలే జీవితంలో అంతర్భాగమై మానవ జాతిని ముందడుగు వేయిస్తాయి. వేదాల విలువ, ప్రాధాన్యం ఆకళింపు చేసుకున్న వేదాభిమానులు వేదాల మార్గదర్శకాల పరిధుల్లోనే ఉంటారు. మానవులు ఆరోగ్యం, ఐశ్వర్యం వంటి ప్రగతిలో కూడా వీటి పాత్ర, భాగస్వామ్యం ఉంటుంది.

– ప్రవా రామకృష్ణ సోమయాజి, వేదార్థ పండితుడు, వేద విశ్వవిద్యాలయం, తిరుపతి

వేదాలతో చరిత్ర మొదలైంది



వేదాలతోనే మానవ చరిత్ర మొదలైంది. వేదార్థాలతోనే నేడు మనవ జాతి నడుస్తోంది. వేదాలను మనం కాపాడితే అవే మనల్ని కాపాడతాయి. వేదాల ప్రాధాన్యం నేటి మానవాళికి తెలియదు. నాలుగు వేదాలు ప్రపంచాన్ని నాలుగు స్తంభాలుగా కాపాడుతున్నాయి. దేశంలో వీటిని ప్రోత్సహించే సంస్థలు పెరగాలి. కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ 62 ఏళ్లుగా చేస్తున్న వేద సేవలు అభినందనీయం.

– కాశీపతి సోమయాజి, తెలంగాణ రాష్ట్ర టీటీడీ వేద పారాయణ సూపర్‌వైజర్, హైదరాబాద్

తేరుకుంటున్న లంకలు

- క్రమంగా తగ్గుతున్న వరద
- ముంపు నుంచి ఉపశమనం



వరద ముంపు నుంచి బయట పడిన అప్పనపల్లి కాజ్‌వే

మామిడికుదురు: వరద వీడుతోంది.. ముంపు నుంచి గ్రామాలకు విముక్తి కలుగుతోంది.. క్రమంగా ప్రతి గ్రామం తేరుకుంటుంది.. ప్రజలకు కష్టాల నుంచి కాస్త ఉపశమనం లభిస్తోంది. జిల్లాలో పది రోజుల పాటు లంక గ్రామాలను ముంచేసిన వరద క్రమ క్రమంగా తగ్గుతోంది. కొన్ని మండలాల్లో ప్రధాన రహదారులు ఆదివారం ముంపు నుంచి బయట పడినప్పటికీ పంట పొలాలు, లింకు రోడ్లు ఇంకా నీటిలోనే ఉన్నాయి. నివాస గృహాలతో పాటు పంట పొలాలను వరద నీరు ఇంకా వీడలేదు. తీర గ్రామాల ప్రజలను వరద కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయిలంకలో వరద తగ్గుముఖం పట్టడంతో పడవల స్థానే ట్రాక్టర్‌పై స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు మాత్రం పడవలపైనే వెళ్తున్నారు. కె.ఏనుగుపల్లి, మానేపల్లి పల్లిపాలెం, నాగుల్లంక పల్లిపాలెం, జొన్నల్లంక ప్రాంతాలు ముంపు నుంచి పూర్తిగా బయట పడ్డాయి. అప్పనపల్లికి ఆర్టీసీ సేవలను పునరుద్ధరించారు. ఈ మార్గంలో యథావిధిగా రాకపోకలు జరుగుతున్నాయి. అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పాటిలంక గ్రామాలు వరద నుంచి క్రమంగా కోలుకుంటున్నాయి. సఖినేటిపల్లి మండలం అప్పనరాముని లంక గ్రామం పూర్తిగా ముంపు నుంచి బయట పడింది. అప్పనరామునిలంక- టేకిశెట్టిపాలెం సరిహద్దులోని గోదావరి పాయపై నిర్మించిన కాజ్‌వేకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్లు ఇంకా ముంపు నుంచి పూర్తిగా బయట పడలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పనరామునిలంక- సఖినేటిపల్లి సరిహద్దులోని గోదావరి పాయపై నిర్మించిన కాజ్‌వే మీదుగా, అప్పనరామునిలంక- రామరాజులంక సరిహద్దులోని మెయిన్‌రోడ్డులో రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ముమ్మిడివరం మండల పరిధి లంకాఫ్‌ఠానేలంక, గురజాపులంక, కూనాలంక, చింతపల్లి లంక, ఐ.పోలవరం మండలం ఎదుర్లంక, కరవాకలంక, పుగాకులంక, తాళ్లరేవు మండలం పిల్లంక, కొత్తలంక గ్రామాల్లో వరద నీరు తగ్గుముఖం పట్టింది. అయినప్పటికీ రహదారులు, నివాస గృహాలు, పంట పొలాలను ఇంకా ముంపు వీడలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కాజ్‌వేను వీడిన ముంపు

తొమ్మిది రోజుల తర్వాత వరద ముంపు నుంచి అప్పనపల్లి కాజ్‌వేకు విముక్తి లభించింది. ఆదివారం నుంచి ఈ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద సమస్య తొలగిపోవడం, కాజ్‌వేపై రాకపోకలు పునరుద్ధరణకు నోచుకోవడంతో అప్పనపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సుల రాకపోకలను పునరుద్ధరించారు. వరద పూర్తిగా తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

నల్లజర్ల: చిన్నారిపై జరిగిన అత్యాచార యత్నం ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సుభద్రపాలెంలో ఒకటో తరగతి చదువుతున్న చిన్నారి (6) ఆడుకోవడానికి వెళ్లి తిరిగి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఉన్నమట్ల వెంకట నాగేశ్వరరావు (54) అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. దీంతో కంగారు పడిన బాలిక అక్కడి నుంచి తప్పించుకుని విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. ఈ ఘటనపై బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వెంకటనాగేశ్వరావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్ల ఎంపిక

జె.పంగులూరు: బాపట్ల జిల్లా పంగులూరులో రాష్ట్ర బాల బాలికల ఖోఖో జట్ల ఎంపికలు జరిగాయి. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ జార్ఖండ్‌లో జరిగే జాతీయ, రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు సబ్ జూనియర్ విభాగంలో బాల బాలికల జట్ల ఎంపిక పూర్తి చేసినట్లు ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆదివారం తెలిపారు. ఇందులో రాష్ట్ర స్థాయి బాలుర జట్టుకు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎస్.వీరేంద్ర, బాలికల జట్టుకు టి.ప్రియ ఎంపికయ్యారు. వీరికి ఆ జిల్లాలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

సినీ పరిశ్రమ రాష్ట్రంలో స్థిరపడేందుకు చర్యలు



సినిమా టైటిల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్, హాస్యనటుడు గౌతమ్‌రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ పరిశ్రమ రాష్ట్రంలో స్థిరపడేందుకు చర్యలు తీసుకుంటామని సినిమాటోగ్రఫీ, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో 4కే ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'గ్రామ ప్రజలకు విజ్ఞప్తి' సినిమా టైటిల్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ చిత్రానికి నిర్మాతగా ముంజలూరి పవన్ కుమార్, దర్శకులుగా సాయి విజయ్ శ్రీరామ్ వ్యవహరిస్తున్నారు. హీరోగా సందీప్, హీరోయిన్‌గా కావేరి పరిచయం అవుతున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సినిమా నిర్మాణానికి అవసరమైన స్టూడియోలు, పోస్ట్ ప్రొడక్షన్ వంటి మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో సినీ పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందడం లేదని వివరించారు. నిర్మాత మండలితో చర్చించి ఆంధ్రప్రదేశ్లో తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రముఖ హాస్యనటుడు గౌతమ్‌రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సినిమా స్టూడియో ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు చిత్ర పరిశ్రమ ద్వారా 63 శాతం నిధులు వెళుతున్నట్టు తెలిపారు. సినిమా దర్శకుడు సాయివిజయ్ శ్రీరామ్, నిర్మాత ముంజలూరి పవన్‌కుమార్, హీరో సందీప్, హీరోయిన్ కావేరిలు మాట్లాడారు.

బంగారు ఆభరణాల చోరీ

పెదపూడి: ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ కథనం ప్రకారం.. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న కాకి సత్యసునీత అక్కడి వరలక్ష్మీ టవర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 14న అర్ధరాత్రి ఆమె కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు తాళాలు బద్దలుకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని బీరువాలోని 90 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

మిగిలింది ఆరు రోజులే..

- ముగింపు దశకు పొగాకు కొనుగోళ్లు
- 21వ తేదీతో ముగుయనున్న ఘైనం
- రూ.2,017 కోట్ల ఆదాయం
- లోగ్రేడు ధర పతనం



దేవరపల్లి కేంద్రంలో వర్జీనియా పొగాకు వేలం ప్రక్రియ

దేవరపల్లి: ఆరుగాలం శ్రమించి సాగు చేసే రైతులకు అనుకూలమైన ధర వస్తే ఆ ఆనందమే వేరు.. అలాంటి పంటల్లో పొగాకు ప్రధానమైంది. ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ప్రారంభించిన తొలి రోజుల్లో ధర దిగజారినా, అనంతరం ఊహించని విధంగా పెరగడం రైతులకు సిరులు కురిపించింది. ఆరు నెలలుగా జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు మరో ఆరు రోజుల్లో ముగియనున్నాయి. రాజమహేంద్రవరం పొగాకు బోర్డు ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నెల 21వ తేదీతో ముగియనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 6న ఐదు వేలం కేంద్రాల్లో 2023-24 సీజన్‌లో పండించిన పంటల కొనుగోళ్లు ప్రారంభించారు.

ప్రారంభంలో కొద్ది రోజులు మార్కెట్ ఒడిదొడుకులు ఎదుర్కొన్నా అనంతరం రైతులు, అధికారులు ఊహించని విధంగా ధర లభించింది. పొగాకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కిలో పొగాకు ధర గరిష్ఠ స్థాయి చేరుకుని రికార్డు సృష్టించింది. ప్రస్తుతం కిలో ధర రూ.407, సగటు ధర రూ.334 రైతుకు వచ్చింది. ఇప్పటి వరకూ 152 రోజుల పాటు పొగాకు వేలం నిర్వహించారు.

ఇప్పటివరకూ విక్రయాలు ఇలా..

ఇప్పటి వరకూ ఐదు వేలం కేంద్రాల్లో రూ.2,017 కోట్ల విలువైన 63.68 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. కిలో గరిష్ఠ ధర రూ. 407, కనిష్ఠ ధర రూ. 150, సగటు ధర రూ. 333.56 మార్కెట్లో లభించింది. 5,15,934 బేళ్ల విక్రయం జరిగినట్టు పొగాకు బోర్డు అధికారులు వివరించారు. ఇదిలా ఉంటే లోగ్రేడు పొగాకు ధర పతనమైంది. ఏప్రిల్ నెలలో లోగ్రేడు పొగాకు కిలో రూ.270 నుంచి 310 ధర పలకగా, ప్రస్తుతం రూ.150 వస్తుందని రైతులు వాపోతున్నారు. దీనివల్ల నష్ట పోతున్నట్టు ఆవేదన చెందుతున్నారు. అయితే బొగులు మాడు, నల్లమాడు గ్రేడులు కావడం వల్ల కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని అధికారులు అంటున్నారు. బ్రైట్, మీడియం గ్రేడులకు మంచి ధర పలుకుతుందని వివరించారు. ప్రస్తుతం లోగ్రేడు పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు తక్కువగా వస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది 15 నుంచి 20 శాతం లోగ్రేడు ఉత్పత్తి జరిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. మంగళవారంతో లోగ్రేడు పొగాకు అమ్మకాలు పూర్తవుతాయని, తర్వాత సూర కొనుగోళ్లు నిర్వహించి వేలం ప్రక్రియను ముగిస్తామని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నాటికి అన్ని వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తవుతాయని బోర్డు ఆర్ఎం ప్రసాద్ తెలిపారు.

వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ఇలా..

వేలం కేంద్రం	కొనుగోళ్లు (కిలోలు)	గరిష్ఠ (రూ.)	కనిష్ఠ (రూ.)	సగటు ధర
దేవరపల్లి	10231338	370	145	325.69
జంగారెడ్డిగూడెం-1	14194456	406	145	333.72
జంగారెడ్డిగూడెం-2	13900277	407	150	335.16
కొయ్యలగూడెం	13894798	404	150	336.48
గోపాలపురం	11462650	400	150	334.89

ఆచితూచి అడుగులు వేయాలి



2024-25లో పంటల సాగుకు రైతులు ఆచితూచి అడుగులు వేయాలి. 2023-24 సీజన్‌లో జింబాబ్వే, బ్రెజిల్ దేశాల్లో పంట ఉత్పత్తి తగ్గినందున మన పొగాకుకు గిరాకీ ఏర్పడింది. దేశంలో పొగాకు వినియోగం పెరగలేదని గమనించాలి. వచ్చే ఏడాది ఆయా దేశాల్లో పంట ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు సాగు విస్తీర్ణం పెంచితే నష్టపోతారు. బోర్డు అనుమతికి లోబడి పంట పండించాలి. సాగుకు యోగ్యంకాని భూముల్లో పొగాకు సాగు చేయడం మంచి విధానం కాదు.

–జీవీకే ప్రసాద్, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

దుకాణాలపైకి దూసుకుపోయిన లారీ



తోకాడలో దుకాణాలపైకి దూసుకుపోయిన గ్యాస్ సిలిండర్ల లోడు లారీ

రాజానగరం: గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న దుకాణాలపైకి దూసుకుపోయింది. సుమారు రూ.3.50 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా. పోలీసుల కథనం ప్రకారం.. అనపర్తి నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో రాజానగరం వైపు వస్తున్న లారీ తోకాడలో రోడ్డు మలుపు తిరుగుతూ పక్కనే ఉన్న దుకాణాలపైకి దూసుకుపోయింది. దీంతో సంగీత శ్రీనివాసరావుకు చెందిన కూరగాయలు, ఫ్రూట్స్, జ్యూస్ షాపు పూర్తిగా ధ్వంసం కాగా, షాపు ముందు పార్కు చేసిన రెండు బైకులు దెబ్బతిన్నాయి. అతివేగంగా రావడంతో మలుపులో వాహనం తిరగలేకే ఈ ప్రమాదానికి దారితీసిందని స్థానికులు తెలిపారు. సాధారణంగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఉన్న సిమెంట్ బల్లలపై స్థానికులు నిత్యం కూర్చుని ఉంటారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనలో దుకాణంలో ఉన్న శ్రీనివాసరావు త్రుటిలో తప్పించుకోగా, ఆ దుకాణం పక్కనే కార్పెంట్ వర్క్ చేస్తున్న ఒక యువకుడికి స్వల్పంగా గాయాలయ్యాయి. లారీ వేగానికి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభం విరిగిపోయింది. ఈ ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ రాజానగరం పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు.

ప్రతిభ చాటి... పతకాలు పట్టి

- ముగిసిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
- మహిళా విభాగంలో సత్తా చాటిన విజేతలు



రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలైన మహిళా లిఫ్టర్లకు పతకాలు అందించిన ఆ క్రీడ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ప్రతిభ చాటారు.. పతకాలు సాధించారు.. రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నువ్వా నేనా అన్నట్లు తలపడ్డారు. దీనికి అమలాపురం వేదిక కాగా, సుమారు 500 మంది క్రీడాకారులు పలు కేటగిరీల్లో పాల్గొన్నారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ ఫిట్నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగిన 11వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. మహిళలు, పురుషుల విభాగాల్లో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ పోటీలు జరిగాయి. బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, స్క్వాట్ కేటగిరీలో క్రీడాకారులు తలపడ్డారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. తొలి రోజు శనివారం జరిగిన మహిళా విభాగం విజేతల వివరాలను హెల్త్ ఫిట్నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొమ్మేటి వెంకటరమణ వెల్లడించారు.

స్ట్రాంగ్ వుమెన్ వీరే..

మహిళా విభాగం సబ్ జూనియర్స్‌లో స్ట్రాంగ్ వుమెన్లుగా పి.శ్రావణి (గుంటూరు), పి.వందన (కోనసీమ), హర్షత తివారి (కడప) నిలిచారు. జూనియర్స్ విభాగంలో ఎస్‌కే సాదియా అల్మస్ (గుంటూరు), ఎం.షానూన్ (గుంటూరు), ఎస్‌కే షబీనా (గుంటూరు) వరుస స్థానాలు పొందారు. సీనియర్స్ విభాగంలో డి.అనూష (ఎన్టీఆర్ జిల్లా), బి.చంద్రిక (గుంటూరు), ఎస్‌కే సాదియా అల్మస్ (గుంటూరు) నిలిచారు. పురుషుల విభాగ పోటీలను ఆదివారం నిర్వహించారు.

మాస్టర్స్ విభాగంలో కడపకు చెందిన డాక్టర్ బాల గోవింద్ తివారి 51 ఏళ్ల కేటగిరిలో బరువు ఎత్తి సత్తా చాటితే, ఆయన కుమార్తె హర్షిత తివారి 57 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. తండ్రి, కూతురు ఒకే వేదికపై పవర్ లిఫ్టింగ్ తలపడి విజేతలుగా నిలవడం విశేషం. తుది విజేతల జాబితా ఆదివారం రాత్రి 11 గంటల తర్వాతే వచ్చే అవకాశం ఉందని జిమ్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్, విశాఖపట్నం మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ పోటీల ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు ప్రదానం చేశారు. పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు నగభేరి కృష్ణమూర్తి, గారపాటి శేఖర్ తదితరులు సేవలు అందించారు.

విజేతలు వీరే..

మహిళా విభాగానికి సంబంధించి సబ్ జూనియర్స్ విభాగంలో చాంపియన్ షిప్‌ను కడప జిల్లా కైవసం చేసుకుంది. గుంటూరు, విజయనగరం జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో గుంటూరు, విజయనగరం, ప్రకాశం, సీనియర్స్ విభాగంలో గుంటూరు, తూర్పు గోదావరి, ఎన్టీఆర్ జిల్లాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. వ్యక్తిగతంగా సబ్ జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని పి.శ్రావణి (గుంటూరు), జూనియర్స్ విభాగంలో ఎస్‌కే సాదియా అల్మస్ (గుంటూరు), సీనియర్స్ విభాగంలో డి.అనూష (ఎన్టీఆర్ జిల్లా) ప్రథమ స్థానాలను సాధించారు.

ఇంటర్నేషనల్ పోటీల్లోనూ తలపడ్డా..



నేను ఇప్పటి వరకూ మూడు ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తలపడ్డాను. మూడు సార్లూ పతకాలు సాధించాను. ఆసియన్ చాంపియన్ షిప్‌ను కూడా సొంతం చేసుకున్నా. నేషనల్ రికార్డు హోల్డర్‌గా నిలాచా. జాతీయ స్థాయి పోటీల్లో 12 వరకూ పాల్గొంటే, రాష్ట్ర స్థాయి పోటీల్లో 40 వరకూ పాల్గొని విజేతగా నిలిచాను. ఇప్పుడు అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో నేను, నా కుమార్తె పాల్గొని పతకాలు సాధించడం ఆనందంగా ఉంది.

–డాక్టర్ బాలగోవింద్ తివారి, మాస్టర్స్ పవర్ లిఫ్టర్, కడప జిల్లా

మా నాన్నతో కలసి పాల్గొనడం బాగుంది



అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మా నాన్న డాక్టర్ బాలగోవింద తివారీతో కలసి పాల్గొనడం ఆనందంగా ఉంది. నేను ఈ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాను. ఒక జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్నా. ఇప్పటి వరకూ నేను ఐదు గోల్డ్ పతకాలు సంపాదించా. మా నాన్న, నేను పవర్ లిఫ్టర్లు అయినప్పటికీ ఇద్దరం ఒకే వేదికపై బరువులు ఎత్తడం అమలాపురం వేదికపైనే సాకారమైంది.

–హర్షిత తివారి, పవర్ లిఫ్టర్, కడప జిల్లా

వినాయక విగ్రహ నిమజ్జనంలో అపశ్రుతి

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి



సందిపర్తి లక్ష్మణ బాబు (ఫైల్)

కిర్లంపూడి: వినాయక నిమజ్జనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వీరవరం గ్రామానికి చెందిన సందిపర్తి లక్ష్మణబాబు (33), తన స్నేహితులతో వినాయక వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి ఆదివారం పాలెంలోని ఏలేరు కాలువ వద్దకు వెళ్లారు. ఏలేరు కాలువలోకి దిగి విగ్రహాన్ని నిమజ్జనం చేసే సమయంలో వేగంగా వస్తున్న నీటి ప్రవాహానికి లక్ష్మణబాబు గోనేడ పాత బ్రిడ్జి వరకూ కొట్టుకుపోయాడు. తన స్నేహితులు కాలువను వెంబడించి బయటకు తీసుకు వచ్చేసరిగా అప్పటికే లక్ష్మణబాబు ప్రాణాలు విడిచాడు. యువకులంతా కలసి ఆటపాటలతో ఆనందంగా గడిపిన కొద్ది గంటల్లోనే లక్ష్మణబాబు చనిపోయాడనే వార్తతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

ఆ కుటుంబానికి ఆధారమై..

లక్ష్మణబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. అక్క, ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లిళ్లు కాగా పెద్ద అక్క, ఆమె కూతురు వీరితోనే ఉంటున్నారు. తల్లిదండ్రులకు వయసు మీద పడింది. దీంతో వారి బాధ్యత కూడా లక్ష్మణబాబు తీసుకున్నారు. కూలీ పనికి వెళ్లి తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో అతని మృతితో ఆ కుటుంబానికి ఆధారం లేకపోయింది. మృతుడి భార్య సందిపర్తి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ నాగళ్ల వెంకటరమణ తెలిపారు. గణపతి విగ్రహాల నిమజ్జనం సమయంలో భక్తులు జాగ్రత్తలు వహించాలని కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ సూచించారు. వరదల కారణంగా మండలంలోని కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, చెరువులు నిండికుండలా ఉండడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి



విద్యుదాఘాతానికి మృతి చెందిన తానింకి నాగేంద్ర

నల్లజర్ల: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పడమరచోడవరానికి చెందిన తానింకి నాగేంద్ర (35) అదే గ్రామానికి చెందిన నూనె సత్యనారాయణకు చెందిన వరికోత మెషీన్‌పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అనంతపల్లి హైస్కూల్ సమీపంలోని తాళ్లూరి గణేష్ వరి చేను కోస్తుండగా ధాన్యం బయటకు రావడం లేదని మెషీన్ పైకెక్కి నాగేంద్ర సరిచేస్తుండగా పైన ఉన్న 11 కేవీ విద్యుత్ వైరు చేతికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడి వారు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి చూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

వరద నీటిలో పడి..



నాగరాజు (ఫైల్)

మామిడికుదురు: అప్పనపల్లి సాకావారిపేటకు చెందిన వడ్డి నాగరాజు (36) కాల కృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. శనివారం నుంచి అతను కనిపించడం లేదని నాగరాజు అన్న య్య అభిమన్యుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం పాటురేవులో వరద నీటిలో నాగరాజు మృతదేహం లభ్యమైందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించామని, దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కళాకారుడు..

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డురోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కళాకారుడు మృతి చెందాడు. అనకాపల్లికి చెందిన 15 మంది తీన్‌మార్ కళాకారుల బృందం గుంటూరులో ప్రదర్శన ఇచ్చేందుకు శనివారం రాత్రి వ్యాన్‌లో బయలు దేరారు.

వారు ప్రయాణిస్తున్న వ్యాన్ రాచపల్లి అడ్డురోడ్డు వద్దకు చేరుకోగానే అనకాపల్లికి చెందిన బి.అప్పారావు (45) టిఫిన్ నిమిత్తం హైవే దాటి హోటల్ వద్దకు వెళ్లాడు. తిరిగి రోడ్డు దాటుతుండగా అన్నవరం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు అప్పారావును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అప్పారావు మృతి చెందాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పంట బోదెలో పడి..



ముక్కామల వద్ద పంట బోదెలో మృతి చెందిన వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తికి ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న పంట బోదెలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పసుపల్లికి చెందిన బొక్కా వెంకటేశ్వరరావు (48) తన మోటారు సైకిల్‌పై ముక్కామల వెళ్తున్నాడు. అతనికి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకుపోయాడు. బోదెలో పడి వెంకటేశ్వరరావు మృతి చెందడంపై స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతిని సోదరుడు సూరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

కాకినాడలో వ్యక్తి దారుణ హత్య



ఈశ్వర దుర్గా ప్రసాద్ (ఫైల్)



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న త్రీ టౌన్ సీఐ సత్యనారాయణ

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన ముద్రగెడ ఈశ్వర దుర్గా ప్రసాద్ (39) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య నీలకంఠ మణి, తొమ్మిదేళ్ల కుమారుడితో కలసి ఏడాది కిందట స్వగ్రామం నుంచి జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడే పలు రకాల పనులు చేస్తూ భార్య, కుమారుడిని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు నెలల కిందట భార్య, కుమారుడిని హైదరాబాద్‌లోనే వదిలి ప్రసాద్ స్వగ్రామానికి తిరిగి వచ్చి గ్రామంలో కొద్ది రోజులు ఉన్నాడు. సుమారు 40 రోజుల కిందట కత్తుల దుర్గ అనే మహిళతో కలసి కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్‌లో ఉన్న కాస్మో ఫుడ్ సెంటర్‌ని ఆనుకుని ఉన్న ఓ ఇంటిని అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏమైందో ఏమో ఆదివారం ఉదయానికి అదే ఇంటి వెనుక దుర్గా ప్రసాద్ తీవ్ర గాయాలతో విగతజీవిగా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి శరీరంపై దాడి చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. కత్తుల దుర్గపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ప్రస్తుతం పరారీలో ఉందని వెల్లడించారు. మృతుడి పెదనాన్న కుమారుడు ముద్రగెడ చక్రపాణి ఫిర్యాదుతో కాకినాడ త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

అనుమానం పెనుభూతమై..

భార్యను హత్య చేసిన భర్త

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం): అనుమానం పెనుభూతమైంది. భార్య ప్రవర్తన సరిగ్గా లేదని భావించిన భర్త ఆమెపై కక్ష పెంచుకుని చున్నీతో ఉరివేసి హత్య చేశాడు. ఈ ఘటన ఆదివారం విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎంవీపీ పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన డానియేల్, సీలేరుకు చెందిన సీహెచ్ సలోమి (28) 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. విశాఖలోని నక్కవానిపాలెం శివాలయం వీధిలో ఉంటున్నారు. డానియేల్ ఎండాడలోని ఓ చర్చిలో పనిచేస్తుండగా, సలోమి నగరంలోని ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు(కవలలు) ఉన్నారు. భార్యపై డానియేల్‌కు అనుమానం ఉండటంతో ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం మరోసారి గొడవ జరగ్గా డానియేల్ చున్నీతో భార్యను హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. సలోని తల్లి వీరి ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె విగతజీవిగా కనిపించింది. వెంటనే ఆమె ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గండేపల్లి: మినీ గూడ్స్ వాహనంలో రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ టి.నాగవెంకటరాజు కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం, కోనలోవకు చెందిన భూముల లోవరాజు తన మినీ గూడ్స్ వాహనంలో 93 బస్తాల్లో సుమారు 3,884 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. జెడ్.రాగంపేట ఐటీపీ బంక్ సమీపంలోకి వచ్చేసరికి ఆ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. కిర్లంపూడి మండలం గోనెడకు చెందిన నల్లంశెట్టి లక్ష్మీనారాయణకు చెందిన ఈ బియ్యం బస్తాలను రాజానగరం మండలం దివాన్‌చెరువు సమీపంలో పౌల్ట్రీలకు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ బియ్యం విలువ రూ.1,78,664 ఉంటుంది. ఈ మేరకు సదరు డ్రైవర్, వాహనంపై 6ఏ, క్రిమినల్ కేసు నమోదుకు గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి వీరబాబు, సీఎస్ డీటీ కృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ



గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా చాగల్లు తెలగా సంఘం వినాయక మంటపం వద్ద హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న 1008 మంది విద్యార్థులు, మహిళలు